క్లుప్తంగా

రాజంపల్లిలో కొండచిలువ కలకలం

● పట్టుకుని అడవిలో వదిలేసిన ఫారెస్ట్ అధికారులు


కొండచిలువ మూతికి ఉన్న చిక్కం

దర్శి: మండలంలోని రాజంపల్లిలో శనివారం ఓ కొండచిలువ ప్రత్యక్షమైంది. గుర్రపుసాల బోడియ్య కుటుంబం అద్దెకుంటున్న నివాసంలోకి కొడచిలువ వచ్చింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. కొండచిలువను బంధించి అడవిలో వదిలేశారు. కొండచిలువ మూతికి వైరు చిక్కం పడింది. అది తెంచుకుని నివాసాల్లోకి వచ్చింది. రెండు రోజుల నుంచి చిక్కం అలాగే ఉండి ఉంటుందని గ్రామస్తులు చెప్తున్నారు. కొండచిలువను బంధించిన వారు చిక్కం జాగ్రత్తగా బ్లేడుతో కోసి తీసి వేశారు. అటవీ శాఖ అధికారులు దాన్ని జాగ్రత్తగా బస్తాలో వేసుకుని తీసుకెళ్లి అడవిలో వదిలేశారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మేనేజర్ కార్తీక్

పెద్దారవీడు: సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా హనుమాన్ జంక్షన్ కుంటలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం బోడిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవినీతి నిర్మూలన గురించి బ్యాంక్ మేనేజర్ కార్తీక్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు కరప్షన్ ఫ్రీ ఇండియా అనే అంశంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. క్యాషియర్ సాయితేస్విని, ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటేశ్వరరావు, సెక్రటరీ వరప్రసాద్, బ్యాంక్ సిబ్బంది మేకల హరినారాయణ, హర్షవర్ధన్, విద్యార్థులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై పోలీసుల దాడి


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు చూపుతున్న ఎస్సై మహేష్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని పెద్దబొమ్మలాపురంలో బెల్ట్ షాపుపై ఎస్సై మహేష్ శనివారం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ అనే మహిళ వద్ద విక్రయానికి సిద్ధంగా ఉన్న 21 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు నోటీసులు జారీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని నంద్యాల ఒంగోలు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్ల నుంచి చిరువ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి శనివారం నగర పంచాయతీ వారు నోటీసులు జారీ చేశారు. నగర పంచాయతీ పరిధిలో చిరు వ్యాపారస్తులు అక్రమంగా నిర్మాణాలు చేపట్టి అనధికారికంగా వ్యాపారాలు కొనసాగిస్తున్నారని, వారం రోజుల్లో రోడ్డు పక్కన ఉన్న చిరు వ్యాపారులు ఖాళీ చేయాలని కమిషనర్ డి.వెంకటదాసు నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో చట్టరీత్యా వారి పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

లాభాల పూదోట


గొబ్బూరులో బంతిపూల తోట


పూలు తెంపుతున్న వెంకటేశ్వరరెడ్డి దంపతులు

● రైతులకు సిరులు కురిపిస్తున్న పూలసాగు

పెద్దారవీడు: పెరిగిన ఖర్చులు, తగ్గిన లాభాలతో అన్నదాతలు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యాన పంటలపై మొగ్గు చూపుతున్నారు. మండలంలోని పెద్దారవీడు, గొబ్బూరు గ్రామాల్లో రైతులు బంతిపూల సాగుతో అధిక లాభాలు గడిస్తున్నారు. పూలకు అన్ని సీజన్లో డిమాండ్ ఉంటుంది. శుభకార్యాలు, వివాహాలు, పండగలు, జాతరలకు విపరీతమైన గిరాకీ ఉంటుంది. తక్కువ పెట్టుబడి, రోజు వారీ ఆదాయం వస్తుండటంతో రైతులు పూల సాగు పెంచుతున్నారు. ఎకరం బంతి సాగు చేసేందుకు రైతుకు రూ.30 నుంచి రూ.40 వేల వరకు ఖర్చు వస్తుంది. ప్రస్తుతం పండగల సీజన్ కావడంతో పూలు వచ్చే విధంగా పూలసాగు చేశారు. కార్తీక మాసం, అయప్పస్వాముల సీజన్లను దృష్టిలో ఉంచుకొని రైతులు పూల సాగుపై దృష్టి పెట్టారు. సరైన పద్ధతిలో సరైన సీజన్లో సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చు. పంట మార్పిడితో నేల సైతం సారవంతమవుతుందని, ఎరువులు, సస్యరక్షణ చర్యలు తక్కువని రైతులు చెబుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఈ పూల సాగుకు మించింది ఏదీ లేదని రైతులు అంటున్నారు. మార్కెట్లో బంతి పూలు రూ.40 నుంచి రూ.50 వరకు ధర పలుకుతోందని, కార్తీకమాసంలో అధిక ధర పలికే అవకాశం ఉంటుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పూలతోట రైతులకు ప్రభుత్వం రాయితీలు కల్పించి పంటసాగుపై అధికారులు అవగాహన కల్పిస్తే మండలంలో ఎక్కువ మంది పూలసాగు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని రైతులు పేర్కొన్నారు.

లాభసాటిగా ఉంటోంది



రెండేళ్ల నుంచి పూల సాగు చేస్తున్నా. ఖర్చు తక్కువతో లాభసాటిగా ఉంది. గతేడాది వేసిన పొలంలో కాకుండా ఈ ఏడాది కొత్త పొలంలో ఎకరా బంతి పూల సాగు చేశా. సీజన్ ప్రారంభం నుంచి పూలు మార్కాపురం పూల మార్కెట్‌కు తరలిస్తున్నా. వాపారులు పూలు కేజీ రూ.50లకు కొనుగోలు చేస్తున్నారు. కార్తీక మాసంలో ఎక్కువ ధరలు పలుకుతాయని ఆశిస్తున్నా. ప్రస్తుతం మార్కెట్‌లో పూలకు మంచి డిమాండ్ ఉంది.

– గొల్మారి వెంకటేశ్వరరెడ్డి, రైతు, గొబ్బూరు

పశువైద్యుల కోసం మూగనోము


పశువైద్యుడు రాక ఖాళీగా ఉన్న కుర్చీ


పశువైద్యుల కోసం వచ్చి బల్లపై సేదతీరుతున్న పశుపోషకుడు

● ఎదురు చూడలేక ఇబ్బంది పడుతున్న పశుపోషకులు

కురిచేడు: స్థానిక పశువైద్యశాలలో వైద్యులు లేక పశువులు వారికోసం మూగనోము నోస్తున్నాయి. ఏ వ్యాధి వచ్చినా వాటికి వైద్యం చేసే వారు లేకపోవడంతో పశువైద్యశాలకు వచ్చి నిరీక్షిస్తున్నాయి. పశుపోషకులు సైతం ఎదురు చూడలేక అక్కడ ఉన్న బోనుకు గేదెను కట్టేసి చెట్ల కింద ఉన్న బల్లపై పడుకుంటున్నారు. మండలం మొత్తానికి ఉన్న ఏకైక వైద్యశాలలో ఇద్దరు వైద్యులు ఉన్నా ఒక్కరు కూడా అందుబాటులో ఉండక పోవడంతో పశుపోషకులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం పొట్లపాడులో జరిగిన గ్రామసభలో పశువైద్య శాఖ జిల్లా సంయుక్త డైరెక్టర్ బేబిరాణికి అందుబాటులో ఉండే వైద్యులను నియమించాలని పశుపోషకలు విజ్ఞప్తి చేశారు. ఆమెకు విషయం తెలిపి వారం రోజులు కాకముందే వైద్యులు లేక పశువులు, పశుపోషకలు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. పశువులు ఉదయం 9 గంటల కల్లా పొలాలకు మేతకు వెళతాయి. తిరిగి సాయంత్రం 5 గంటలకు ఇల్లకు తిరిగి వస్తాయి. పశువైద్యశాలలు ఉదయం 9 గంటలకు తెరుచుకుని సాయంత్రం 5 గంటల కల్లా మూతబడతాయి. అంటే పశువులు పొలం వెళ్లిన తర్వాత తలుపులు తీసి అవి తిరిగి ఇంటికి రాక ముందే మూసివేస్తారు. దీంతో పశువులకు కలిగే ఉపయోగమేమిటో పాలకులకే అర్థంకావాలి. అంతే కాకుండా వ్యాధులు నిర్ణీత సమయానికి మాత్రమే వస్తాయనే నిబంధన ఏమైనా ఉందా? అనే కోటి డాలర్ల పశ్న. పశువైద్యశాలల్లో ఏర్పాటు చేసిన 1092 వాహన సమయాలు కూడా అలాగే ఉండటం విశేషం. అలా కాకుండా పశువైద్యశాలలు మూసినా అత్యవసర వైద్య చికిత్సలు అందించేందుకు పశువైద్యులు వైద్యశాలలు ఉన్నచోట అందుబాటులో ఉండాల్సిన ఆవశ్యకతను పశువైద్యశాఖ ఉన్నతాధికారులు, పాలకులు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

కోటమ్మకు ఎమ్మెల్యే బూచేపల్లి నివాళి


కోటమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి


తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెం సర్పంచ్ సుబ్బారావు తల్లి చిమట కోటమ్మ చిత్రపటానికి దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇటీవల కోటమ్మ మృతి చెందగా శనివారం నిర్వహించిన పెద్ద కర్మకు ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తూము వెంకట సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీలు పోశం మధుసూదన్‌రెడ్డి, గోళపాటి మోషే, సర్పంచ్‌లు మంద శ్యాంసన్, ఉప సర్పంచ్ పులి ప్రసాద్‌రెడ్డి, నాగిరెడ్డి, ఎస్కే వలి, వెంకట్రామిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా, మాజీ సొసైటీ అధ్యక్షుడు ఎలమందారెడ్డి, నాయకులు ఐవీ సుబ్బారెడ్డి, బొగ్గుల శ్రీనివాసరెడ్డి, గువ్వల శ్రీనివాసరెడ్డి, దేవదానం, బొమ్మిరెడ్డి సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, కోట కృష్ణారెడ్డి, గ్రామ నాయకులు శనివారపు శ్రీనివాస రెడ్డి, సోము అనిల్‌రెడ్డి, కొమ్మరెడ్డి రాజా, పసుపులేటి కోటయ్య, బొల్లంపల్లి వాసు పాల్గొన్నారు.

18వ రోజుకు చేరిన కాంట్రాక్టు కార్మికుల నిరసన దీక్ష

మార్కాపురం టౌన్: మార్కాపురం పురపాలక సంఘ కార్యాలయంలో తొలగించిన కాంట్రాక్టు కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. పురపాలక సంఘ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు కార్మికులు నిర్వహిస్తున్న నిరసన దీక్ష శనివారానికి 18వ రోజుకు చేరింది. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయంలో దాదాపు 20 నుంచి 25 ఏళ్లుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. ప్రభుత్వం చిరుద్యోగులపై తమ ప్రతాపం మానుకొని కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా కూటమి ప్రభుత్వం తమను అక్రమంగా తొలగించి తమ ఉపాధిని కోల్పోయేలా చేశారన్నారు. సుబ్బరాయుడు, ఇమాంసా, చెన్నకేశవులు, జి.హరి, శ్రీను, కనకయ్య పాల్గొన్నారు.

తిరుమలనాథస్వామికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో తిరుమలనాథస్వామి


అలంకరణలో రాజ్యలక్ష్మి అమ్మవారు

పెద్దారవీడు: మండల పరిధిలోని చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు శనివారం చేశారు. అర్చకులు భవానీప్రసాద్ స్వామి, అమ్మవారికి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవారికి పట్టువస్త్రాలు, ఆభరణాలు ధరించి పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి వద్ద దంపతులు కుంకుమార్చన, పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవారిని వారిని దర్శించుకొని కాయకర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కోతకు గురైన రోడ్డు



కొనకనమిట్ల: మండలంలోని గరిమిన పెంట నుంచి వెలుగొండ్రాయునిపల్లి ఎస్సీ కాలనీకి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురైంది. దీంతో గరిమినపెంట నుంచి వెలుగొండ్రాయునిపల్లి ఎస్సీ కాలనీ, గొట్లగట్టు వరకు వెళ్లే వారికి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ట్రాక్టర్, ఆటోలు ఆ రోడ్డున రావాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. వర్షం పడితే మరింత ఇబ్బందిగా ఉంటుందన్నారు. వర్షం పడినప్పుడు తరుచూ కోతకు గురవుతుందని, అధికారులు స్పందించి కోతకు గురైన చోట శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అలాగే గరిమినపెంట సమీపంలోని వాగు వద్ద చప్టా నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలు పండించాలి


మాట్లాడుతున్న ఏవో ఫరూక్

ముండ్లమూరు (దర్శి): పొగాకుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ రైతులకు సూచించారు. మండలంలోని పోలవరంలో పొగాకుకు ప్రత్యామ్నాయంపై రైతులకు శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఫారుక్ మాట్లాడుతూ అందరూ పొగాకు సాగు చేయడానికి సన్నద్ధం అవుతున్నారని, దీంతో రాబోయే రోజుల్లో పంట అమ్మకాలపై ప్రభావం పెరుగుతుందన్నారు. పొగాకు సాగుతో భూమిలో ఉన్న పోషకాలు త్వరగా తగ్గిపోతాయన్నారు. భూమి కోతకు గురవుతుందని చెప్పారు. వీటి వలన సాగు చేసే రైతులకు అదనపు భారం పడుతుందన్నారు. ప్రత్యామ్నాయ పంటలుగా మొక్కజొన్న, మినుము, పెసలు, శనగ వంటి పంటలు సాగు చేయాలని చెప్పారు. తద్వారా పెరుగుతున్న జనాభాకు ఆహారాన్ని అందించగలమని కోరారు. అపరాల సాగు పెంచేందుకు సబ్సిడీ విత్తనాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మినుము వీబీఎన్–8 రకం కేజీ రూ.98కి అందుబాటులో ఉన్నాయని చెప్పారు. శనగ విత్తనాలు క్వింటా రూ.7050కి ఇస్తున్నట్లు తెలిపారు.

తేడా సొత్తు సిబ్బంది నుంచి రికవరీ చేస్తాం

● డ్వామా పీడీ జోసఫ్


ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

దర్శి: ఉపాది హామీ పథకం ద్వారా ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది నుంచి మండలంలో వచ్చిన రూ.325610 కొలతల తేడాను రికవరీ చేస్తామని డ్వామా పీడీ జి.జోసఫ్ అన్నారు. స్థానిక మండల కార్యాలయంలో దర్శి మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా అక్టోబర్ 14వ తేదీ నుంచి నవంబర్ ఒకటో తేదీ వరకు అన్నీ గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీలు నిర్వహించామన్నారు. దీనికి సంబంధించి శనివారం ప్రజావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ జోసఫ్ మాట్లాడుతూ 1437 పనులను సామాజిక తనిఖీ బృందం మండలంలో తనిఖీ చేయగా రూ.17,36,49,924లు ఖర్చు చేశారన్నారు. అందులో మూడు లక్షలు పైచిలుకు విలువ గల కొలతలు వివిధ గ్రామ పంచాయతీల్లో తేడాలు కనుగొన్నామన్నారు. వాటిని సంబంధిత సిబ్బంది నుంచి రికవరీ చేస్తామని చెప్పారు. కొన్ని కొలతలు డెప్తులు తగ్గాయన్నారు. ఎస్టిమేషన్‌లో తేడాలు ఉన్నాయని పేర్కొన్నారు. అలాంటి పనులన్నీ గుర్తించి రికవరీ చేస్తున్నామని వివరించారు. డీపీఓ పి.ఝాన్సీరాణి, ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఏపీఓ కళ్యాణి పాల్గొన్నారు.

వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సునీత

● చింతల వైద్యాధికారి డాక్టర్ యాగ్నిక్

పెద్దదోర్నాల: విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని చింతల వైద్యాధికారి డాక్టర్ యాగ్నిక్ పేర్కొన్నారు. వ్యాధి నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులకు రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సంక్షేమ వసతి గృహాల్లో డయేరియా, మలేరియాతో పాటు విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించి వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అవగాహన కల్పించారు. దీంతో పాటు విద్యార్థుల నుంచి రక్తపూత నమూనాలు సేకరించారు. సూపర్‌వైజర్‌లు భరత్ భూషణ్, వెంకటేశ్వరరెడ్డి, మంత్రూనాయక్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దొనకొండ: స్థానిక కేజీబీవీ విద్యార్థులకు వైద్యాధికారి ఎం.సునీత శనివారం వైద్య పరీక్షలు చేశారు. సీజన్‌లో అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ముందు జాగ్రత్తగా తాము వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. 102 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గు ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. భోజనం ముందు చేతులు శుభ్రం చేసుకోవాలని, స్వచ్ఛమైన నీరు తాగాలని పలు సూచనలు, సలహాలు వైద్యాధికారి అందించారు. ఆమె వెంట ఏఎన్ఎం కుసుమ, ఆశాలు పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు

పొదిలి: శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి జరుపుతున్నట్లు ఆలయ నిర్మాణ, నిర్వహణ కమిటీ సభ్యులు, గౌరవాధ్యక్షుడు శ్రావణి వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు యక్కలి శేషగిరిరావు తెలిపారు. 3న అంకురార్పణ, 4న ధ్వజారోహణ 5న హనుమంత వాహనం, 6న గరుడ వాహనం, 7న కళ్యాణోత్సవం, 8న దివ్య మహాభిషేకం, అశ్వ వాహనం, 9న చక్రస్నానం, ద్వాదశ ఆరాధన, అన్న సమారాధన కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. దేవాలయం ప్రధాన సలహాదారులు నారాయణం మురళీకృష్ణమాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు దీవి శ్రీకాంత్ భట్టర్, సహాయ అర్చకులు వై.రుషీకేశవాచార్యులు ఆధ్వర్యంలో పూజాధికాలు, బ్రహ్మోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దేవుని కృపకు పాత్రులు కావాలని కార్యదర్శి పెరుమాళ్ల భాస్కర్, కోశాధికారి శనగపల్లి నాగేశ్వరరావు కోరారు.